సాక్షి ఆదిలాబాద్

గురువారం । 21 । మార్చి । 2024

నేడు అవగాహన ర్యాలీ

కైలాస్‌నగర్: ప్రపంచ అటవీ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు జిల్లా అటవీ శాఖ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ జెడ్పీ కార్యాలయం వరకు సాగుతుందని పేర్కొన్నారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్		సహర్
గురు :	6:28	శుక్ర:	4:56

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/22.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

‘టెన్త్’లో మాస్ కాపీయింగ్ !

- బాధ్యులపై కొనసాగుతున్న విచారణ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో పదో తరగతి పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జోరుగా సాగుతుంది. ఉపాధ్యాయులే విద్యార్థులకు జవాబులు అందిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం హిందీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉట్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్నలు బయటకు వచ్చినట్లు తెలిసింది. వీటికి సంబంధించిన జవాబులను ఓ మైనార్టీ గురుకులం ఉపాధ్యాయుడు స్వయంగా ఇంటికి వెళ్లి పేపర్‌పై రాసి దానిని మళ్లీ అదే సెంటర్‌లో అందించినట్లు సమాచారం. ఈ విషయంపై సదరు ఉపాధ్యాయుడు, మరోవ్యక్తితో ఫోన్‌లో సంభాషణ ఆడియో బయటకు రావడం సంచలనం సృష్టించింది. అలాగే ఉపాధ్యాయుడు స్వయంగా పేపర్‌పై జవాబులు రాస్తున్న వీడియో కూడా బయటకు పొక్కింది. పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అధికారులు ఓవైపు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉండడం గమనార్హం. ఈ విషయమై ఎంఈవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. మాస్‌కాపియింగ్‌పై కలెక్టర్, డీఈవోకు సమాచారం అందించినట్లు చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీఈవో ఆదేశించారు. అలాగే ఉట్నూర్ డీఎస్పీ బుధవారం బాధ్యులను విచారించినట్లు చెప్పారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం



మాట్లాడుతున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని ట్రెయినీ అసిస్టెంట్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ముందుగా పాలిటెక్నిక్ కళాశాల నుంచి విద్యార్థులు ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓటరు నమోదు, ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, రూరల్ తహసీల్దార్ దిలీప్, కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా ముందుకు..

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సక్కు



సమావేశంలో పాల్గొన్న సక్కు తదితరులు

ఆదిలాబాద్‌టౌన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగుతున్నామని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్య నాయకులతో ఎన్నికల సన్నద్ధతపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రణాళికలు, ప్రచార వ్యూహాలు, ఇతరత్రా అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సక్కు మాట్లాడుతూ.. తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలిపేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆదరించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, పార్టీ ముఖ్య నాయకులు జాన్సన్ నాయక్, రాంకిషన్‌రెడ్డి, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

హోలీ 25న జరుపుకోవాలి

ఆదిలాబాద్: హోలీ పర్వదినం ఈనెల 25న నిర్వహించుకోవాలని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామిజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24న కామ దహనం నిర్వహించుకోవాలని, మరుసటి రోజు సోమవారం హోలీ పండుగ జరుపుకోవాలన్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించే వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గేడం మాధవ్, ప్రఫుల్ వజే, సూర్యకాంత్ తదితరులు ఉన్నారు.

అడవి తల్లి కన్నీరు!

ఆదిలాబాద్.. ఒకప్పుడు దట్టమైన అడవుల జిల్లాగా పేరొందింది. వన్యప్రాణులు, పలు రకాల అరుదైన జంతువులకు ఆవాసంగా ఉండేది. అయితే స్మగ్లర్ల గొడ్డలి వేటుకు అడవి తల్లి కన్నీరు పెడుతోంది. అటవీశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నప్పటికీ చెట్లు నేల కొరుగుతూనే ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం పరుచుకున్నా అడవి మధ్యలో మైదానాలే దర్శనమిస్తున్నాయి. అటవీ సంపదతో పాటు మూగజీవాలు సైతం అంతరించి పోతున్నాయి. రేడియేషన్ ప్రభావంతో కొన్ని రకాల పక్షులు కనుమరుగవుతుండగా... దాహార్తి తీర్చుకునేందుకు వన్యప్రాణులు జనావాసాల బాట పడుతున్నాయి. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి. అడవిని కాపాడుకోవడం అందరి బాధ్యతగా గుర్తించాలని అధికారులు, ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు. నేడు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– ఆదిలాబాద్‌టౌన్

మావల పరిధిలోని అటవీప్రాంతం





స్మగ్లర్ల గొడ్డలి వేటుకు నేలవాలిన చెట్టు (ఫైల్)

- అంతరించిపోతున్న అటవీ సంపద
- గొడ్డలి వేటుకు మైదానాలుగా వనాలు
- కనుమరుగవుతున్న అరుదైన వన్యప్రాణులు
- నేడు ప్రపంచ అటవీ దినోత్సవం

జిల్లా విస్తీర్ణం : 4,15,300 హెక్టార్లు
అటవీ విస్తీర్ణ పరిధి : 1,82,613 హెక్టార్లు
హరితహారంలో నాటిన మొక్కలు : 5కోట్ల 49లక్షల 36వేలు
ఈ ఏడాది కలప అక్రమరవాణా కేసులు : 509
స్వాధీనం చేసుకున్న కలప విలువ : రూ.42 లక్షలు
పరారీలో ఉన్న నిందితుల కేసులు : 244



జిల్లాలో అటవీ విస్తీర్ణం పెరగడం లేదు. ప్రభుత్వాలు అటవీ సంపదను పెంచేందుకు హరితహారం, తదితర కార్యక్రమాలు చేపట్టినప్పటికీ అనుకున్న స్థాయిలో ఫలితాలు కానరావడం లేదు. స్మగ్లర్లు కలప అక్రమ రవాణాను వీడకపోవడంతో లక్ష్యం నీరుగారిపోతోంది. జిల్లాలో 40శాతం వరకు అటవీ విస్తీర్ణం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే మహారాష్ట్రకు ఆనుకొని ఉన్న తలమడుగు, తాంసి, బజార్‌హత్నూర్ అటవీ సంపదను చికిలి, పటోజీ, అంబాడీ ప్రాంతాలకు చెందిన స్మగ్లర్లు టేకు వనాలను కుప్పకూల్చుతున్నట్లు తెలుస్తోంది. ఇచ్చోడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా కలప రవాణా కొనసాగుతోంది. ఇటీవల అటవీశాఖ కార్డన్‌సెర్చ్ నిర్వహించినప్పుడు అక్రమంగా నిల్వ ఉంచిన రూ. లక్షల విలువ గల కలప లభించింది. సిరిచెల్మ, పెంబి, ఖానాపూర్, కడెం, మామడ అటవీ ప్రాంతంపై స్మగ్లర్లు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

ఆదివాసీలకు జీవనోపాధి..

అడవినే నమ్ముకొని ఆదివాసీ, గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అటవీ ప్రాంతంలో లభించే వెదురు, తేనే, ఇప్ప పువ్వు, తునికాకు సేకరణతో పాటు ఈజీఎస్ ద్వారా పనులు, తడకలు అల్లుతూ ఉపాధి పొందుతున్నారు. అలాగే తునికి పండ్లు, పరికి పండ్లు, జీడిపండ్లను సైతం అటవీ ప్రాంతం నుంచి సేకరిస్తూ విక్రయాలు జరుపుతుంటారు.

అంతరించిపోతున్న వన్యప్రాణులు..

జిల్లాలో వన్యప్రాణులు అంతరించిపోతున్నాయి. ప్రధానంగా పులి, గద్దలు, కాకులు, రాబందులు కనుమరుగయ్యాయి. పిచ్చుకలు సైతం జాడలేకుండా పోయాయి. ఒకప్పుడు అధిక సంఖ్యలో దర్శనమిచ్చే జింకలు, నెమళ్లు, నీలుగాయిలు, కుందేళ్లు, దుప్పులు, తదితర జీవులు ఎప్పుడో ఒకటి రెండు కనిపిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో దాహార్తి తీర్చుకోలేక జనవాసాల్లోకి వస్తున్నాయి. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. అధికారులు మాత్రం వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ ప్రాంతంలో నీటి కుంటలు, గడ్డి మైదానాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆరు ప్రాంతాల్లో సోలార్ బోర్ మోటార్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొంటున్నారు. ఇందులో ఆదిలాబాద్‌లోని మావల, నేరడిగొండలోని వడూర్, ఇచ్చోడలోని డెడ్రా, భీంపూర్ మండలంలోని అర్లి, ఉట్నూర్ డివిజన్ పరిధిలోని బీర్సాయిపేట్, బోథ్ ప్రాంతాలు ఉన్నాయి. అలాగే జిల్లాలోని 72 ప్రాంతాల్లో సాసర్‌ఫిట్ (కుంటలు) ఏర్పాటు చేసినట్లు పేర్కొంటున్నారు.

అటవీ రక్షణకు ప్రత్యేక చర్యలు..

అడవులను రక్షించేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బేస్‌క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఐదుగురు సిబ్బందితో కూడిన బృందాలను నియమిస్తున్నారు. వీరికి నెలకు రూ.12వేల చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. ఈ క్యాంప్‌ను బీట్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు. అలాగే అటవీని రక్షించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉన్నాయి. ఇందులో ఐదుగురు సభ్యులు ఉంటారు. ఎక్కడైనా స్మగ్లింగ్ జరిగితే పసిగట్టి వాటిని అరికట్టేందుకు చర్యలు చేపడతారు. స్మగ్లర్లపై కేసులు నమోదు చేయిస్తారు. జంతు పరిరక్షణ కోసం ఎనిమల్ ట్రాకర్లతో పాటు మూగజీవాలను హతమార్చకుండా ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏయే జీవులు సంచరిస్తున్నాయనే విషయాన్ని నిరంతరం పరిశీలిస్తారు.

అడవి సంరక్షణ అందరి బాధ్యత



అడవిని సంరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. మూగజీవాల దాహార్తి తీర్చేందుకు అటవీ ప్రాంతంలో కుంటల ఏర్పాటుతో పాటు సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసి బోర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. అడవుల సంరక్షణకు సహకరించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. చెట్లను నరికివేయకుండా చర్యలు చేపడుతున్నాం. మొక్కలు నాటుతూ అటవీ విస్తీర్ణం పెరిగేలా చూస్తున్నాం.

– ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, డీఎఫ్‌వో

‘కమలం’లో ముసలం

- బీజేపీ పార్లమెంట్ స్థాయి సమావేశానికి ఎమ్మెల్యేలు దూరం
- టికెట్ దక్కని ఎంపీ ‘సోయం’ కూడా గైర్హాజరు
- మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సైతం..
- సిట్టింగ్ స్థానంలో ఎందుకీ పరిస్థితి
- క్యాడర్‌లో అయోమయం

సాక్షి, ఆదిలాబాద్: కమలం పార్టీలో ముసలం మొదలైంది. బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా గొడం నగేశ్‌ను ప్రకటించిన తర్వాత ఆ పార్టీలో విభేదాలు వెలుగుచూశాయి. తాజాగా కేంద్ర మంత్రి జిల్లా పర్యటనలో బహిర్గతమయ్యాయి. అయితే పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలందరి ఏకాభిప్రాయంతోనే పార్టీ అభ్యర్థి ఎంపిక జరిగిందని కమలం నేతలు చెప్పుకొచ్చారు. కార్యకర్తలూ అదే కావచ్చని అనుకున్నారు. ఆ తర్వాత టికెట్ ఆశించిన ఆశావహుల్లో కొందరు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, అభ్యర్థి గెలుపునకు దోహద పడతామని చెప్పుకుంటూ వచ్చారు. కొంత మంది సైలెంట్‌గా ఉన్నారు. మరోవైపు చివరిదాకా టికెట్ ఆశించి భంగపడ్డ సిట్టింగ్ ఎంపీ సోయం అలక బూనారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మరి వీరందరిని సమన్వయపర్చి ఏకతాటిపైకి తీసుకొచ్చేప్రయత్నం జరుగుతుందా అంటే ఇప్పటివరకు ఆ దిశగా చర్యలేమి కనిపించడం లేదన్న అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతుంది.

అందరూ దుమ్మా..

బీజేపీ పార్లమెంట్ స్థాయి సమావేశం తలమడుగు మండలం ఉండంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి అర్జున్ ముండా హాజరయ్యారు. పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతలంతా ఇందులో పాల్గొనాలి. అయితే నిర్మల్, ముథోల్, సిర్పూర్ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, హరీష్‌బాబు రాలేదు. సిట్టింగ్ ఎంపీ సోయం కూడా దూరంగా ఉన్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సైతం గైర్హాజరవడం గమనార్హం. దీంతో అసలు ఏం జరుగుతుందోనని కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

ఏకతాటిపైకి తెచ్చేదెవరు..?

మార్చి 10న ఢిల్లీ నుంచి విడుదలైన బీజేపీ అభ్యర్థుల రెండో జాబితాలో ఆదిలాబాద్ సిట్టింగ్ స్థానం నుంచి నగేశ్ పేరు వెల్లడైంది. అంతకు నాలుగు రోజుల ముందే ఆయన బీఆర్‌ఎస్ నుంచి కమలం పార్టీలో చేరారు. ఈ క్రమంలో నగేశ్‌కు టికెట్ ఇవ్వొద్దని పార్టీలోని పలువురు సీనియర్లు, ఆశావహులు ఢిల్లీ వెళ్లి అగ్రనేతలను కలిసి విన్నవించారు. అయినప్పటికీ పార్టీ నగేశ్ వైపే మొగ్గుచూపింది. అయితే టికెట్ ఖరారైన తర్వాత తొలిసారి నియోజకవర్గానికి హైదరాబాద్ నుంచి వస్తున్న అభ్యర్థి నగేశ్‌కు మొదట నిర్మల్ జిల్లా సోన్ వద్ద పార్టీ శ్రేణులు స్వాగతం పలకాలి. కానీ అలాంటిదేమి కనిపించలేదు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ వద్ద ఆయనకు కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో పరిస్థితులను చక్కదిద్దే బాధ్యత ఇప్పుడు ఎవరు తీసుకుంటారనేది కార్యకర్తల్లో నెలకొంది. ప్రస్తుతం ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఉన్నారు. బుధవారం పార్లమెంట్ స్థాయి సమావేశం ఉందని ఆదిలాబాద్ పట్టణ కార్యదర్శి వేదవ్యాస్ నుంచి ప్రకటన జారీ కావడంపై పార్టీ సీనియర్ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ స్థాయి సమావేశ ఆహ్వానం ఇలా పట్టణ కార్యదర్శి నుంచి జారీ కావడమేంటా అని విస్తుపోతున్నారు. ఆ ఆహ్వానంలో ఎమ్మెల్యే శంకర్, అభ్యర్థి నగేశ్ పాల్గొంటున్నారని, కేంద్ర మంత్రి వస్తున్నారని పేర్కొన్నారు. మిగతా ఎమ్మెల్యేల పేర్లు ఎందుకు ఇందులో పొందుపర్చలేదనేది సామాన్య కార్యకర్త ప్రశ్నించే పరిస్థితి. ఈ లెక్కన పార్లమెంట్ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్న శంకర్ అందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేయడం లేదా.. లేనిపక్షంలో ఈ వ్యవహారం తనది కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారా అనే సందిగ్ధం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

‘సోయం’కు బుజ్జగింపులు

సిట్టింగ్ స్థానం నుంచి తిరిగి టికెట్ దక్కకపోవడంతో అలకబూనిన సోయం బాపూరావును ఇటీవల హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కలిసి బుజ్జగింపు ప్రయత్నాలు చేశారు. కేంద్రంలో మరోసారి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అయితే ఈ విషయంలో జాతీయ అధ్యక్షుడు నడ్డా సమక్షంలో చెప్పించాలని సోయం చెప్పడంతో దానికి కిషన్‌రెడ్డి సరే అన్నట్టు పార్టీలో ప్రచారం ఉంది. అదే జరిగితే తాను నగేశ్ పక్షాన ప్రచారానికి వెళ్లే విషయాన్ని పరిశీలిస్తానని కిషన్ రెడ్డికి సోయం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. సోయం బుజ్జగింపుల వరకే రాష్ట్ర నాయకులు పరిమితమవుతారా.. లేనిపక్షంలో ఈ పార్లమెంట్ పరిధిలోని ఇతర అసంతృప్తి నేతలను కూడా బుజ్జగించే ప్రయత్నం చేస్తారా అనేది చూడాల్సిందే.

ఈసీ నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ రాజర్షి షా
- ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం

కైలాస్‌నగర్: రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార సామగ్రిని ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు ఈసీ నిబంధనలు విధిగా పాటించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీకేంద్రాల యజమానులతో బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, గోడప్రతులు, ఫ్లెక్సీలు ఆర్డర్ ఇచ్చే వారి వివరాలను నిర్వాహకులు భద్రంగా రికార్డు చేసుకోవాలని సూచించారు. ఎన్ని కాపీలు ప్రింట్ చేశారు, అందుకు ఎంత వ్యయమైందనే వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా వ్యయ కమిటీకి అందజేయాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో ఎస్పీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద లావాదేవీలపై ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

అనుమానాస్పద నగదు లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా అన్నారు. తన కార్యాలయ చాంబర్‌లో బ్యాంకర్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.50వేల నుంచి రూ.10 లక్షల మధ్య జరిగే లావాదేవీలకు తప్పనిసరిగా రశీదు ఉండాలన్నారు. రూ.10 లక్షలపైన లావాదేవీలుంటే ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందన్నారు. ఏటీఎంల్లో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏజెన్సీలు పెద్ద మొత్తంలో డబ్బులు తరలించాలంటే సీఈవో నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. లాకర్స్‌లో గోల్డ్‌ను పర్యవేక్షించి, నగదు జెనరేట్ చేసేందుకు క్యూఆర్ కోడ్ ఉపయోగించాలన్నారు. ప్రతి రోజు నగదు డిపాజిట్ వివరాలను నమోదు చేయాలన్నారు. ఈసీ నిబంధనల ప్రకారం సీజ్ చేసిన వా టిని ఈసీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వైలెన్స్ బృందాల నిఘాలో పట్టుకున్న డబ్బు, మద్యం, బంగారం, డ్రగ్స్ వంటి వస్తువుల వివరాలను సైతం పోర్టల్‌లో ఎ ప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. స మావేశంలో ఎస్పీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎల్‌డీఎం భాస్కర్ ప్రసాద్, ఎక్సైజ్ అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

మీడియా సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను కలెక్టర్ రాజర్షి షా బుధవారం సందర్శించారు. రిజిస్టర్లను పరిశీలించారు. సోషల్ మీడియా ప్రసారాలపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

ఆదివాసీల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అర్జున్ ముండా

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మాటలు నమ్మొద్దు
- గిరిజన ఎంపీ సీటును మోదీకి కానుకగా అందించాలి
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా

కైలాస్‌నగర్/తలమడుగు: ఆదివాసీల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట వేస్తుందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల హయాంలో కోట్లాది రూపాయల కుంభకోణాలు, అవినీతి, అక్రమాలు జరిగాయని అలాంటి పార్టీలు మరోసారి మభ్యపెట్టేందుకు వస్తున్నాయని, వారి మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి ప్రధాని మోదీకి కానుకగా అందించాలని విజ్ఞప్తి చేశారు. తలమడుగు మండలం ఉండం గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పార్లమెంట్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏకలవ్యమోడల్ పాఠశాలల ద్వారా ఆదివాసీ బిడ్డలకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లుగా తెలిపారు. స్వయం సహాయక మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేశామని గుర్తు చేశారు. బిర్సా ముండా, కుమురంభీం వంటి వీరుల త్యాగాలను స్మరించుకునేలా ప్రత్యేక మ్యూజి యం ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. దేశంలో రామరాజ్యం రావాలంటే నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిగా చేయాలని కోరారు. దేశంలోని 47ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లోనూ బీజేపీ గెలుపొందడం ఖాయమని, ఆదిలాబాద్ ఎంపీగా గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి నగేశ్ మాట్లాడుతూ పార్టీకి, కార్యకర్తలకు ఎలాంటి మచ్చరాకుండా విలువలతో కూడిన రాజకీయం చేస్తానన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ గల్లీలో ఎవరునాన ఢిల్లీలో మాత్రం మోదీయే అధికారంలో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అనంతరం కేంద్ర మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌కు చెందిన జెడ్పీటీసీ లు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి, పతంగే బ్రహ్మానంద్, నాయకులు చిట్యాల సుహాసినీరెడ్డి, వకుళాభరణం ఆదినాథ్, అయ్యన్నగారి భూమయ్య, అశోక్ ముస్తాపురే, జ్యోతిరెడ్డి, వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రానికి విచ్చేసిన కేంద్ర మంత్రి అర్జున్ ముండాకు బీజేపీ శ్రేణులు బుధవారం ఘన స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్న మంత్రికి ఎంపీ అభ్యర్థి నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. అనంతరం జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై కాసేపు వారు చర్చించారు. ఇందులో పార్టీ జిల్లా నాయకులు, పలువురు కౌన్సిలర్లు తదితరులున్నారు.

సుంకిడిలో ఇంటింటి ప్రచారం..

తలమడుగు: ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను భారీ భారీ మెజార్టీతో గెలిపించాలని కేంద్ర మంత్రి అర్జున్ ముండా కో రారు. మండలంలోని సుంకిడి గ్రామంలో బీ జేపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు మద్దతుగా బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూ లమాల వేసి నివాళులర్పించారు.



ఇంటింటి ప్రచారంలో కేంద్ర మంత్రి అర్జున్ ముండా

క్లుప్తంగా

కోర్టులో లొంగిపోయిన పోస్టల్ ఉద్యోగి

ఆదిలాబాద్‌టౌన్: రైతుల డబ్బులను సొంత ఖాతాలోకి మళ్లించుకున్న ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) మేనేజర్ విజయ్ జాదవ్ మంగళవారం కోర్టులో లొంగిపోయాడు. దీంతో ఆదిలాబాద్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆయనను జిల్లా జైలుకు తరలించేలా ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన జిల్లా జైలులో ఉన్నాడు. ఇదిలా ఉండగా వన్‌టౌన్ పోలీసులు జుడీషియల్ కస్టడీ కోసం దరఖాస్తు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. 69 మంది రైతులు సీసీఐకి విక్రయించిన పత్తి డబ్బులు రూ.36లక్షలు తన సొంత ఖాతాలో మళ్లించుకున్నాడు. రైతులు జిల్లా అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన ఆ శాఖ ఉన్నతాధికారి విచారణ జరిపి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదైంది. పరారీలో ఉన్న ఆ అధికారి కోర్టులో లొంగిపోయాడు.

బెల్టుషాపుపై పోలీసుల దాడి



పట్టుకున్న మద్యంతో ఎస్సై, సిబ్బంది

బోథ్: మండలంలోని కౌట గ్రామంలో ఓ బెల్టుషాపుల్లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం మేరకు బెల్టుషాపు పై బుధవారం రాత్రి దాడి చేయగా రూ. 41,680 విలువ గల 38.401 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.40వేల మద్యం పట్టివేత

బేల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలోని రెండు చోట్ల బెల్టు షాపుల్లో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు బెల్టు షాపుల్లో రూ.40వేల మద్యం పట్టుకున్నట్లు, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక పేర్కొన్నారు.

రూ.1.20 లక్షల నగదు పట్టివేత

భైంసాటౌన్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.20 లక్షల నగదును పట్టుకున్నట్లు పట్టణ సీఐ డి.రాజారెడ్డి తెలిపారు. పట్టణంలోని భోకర్ చౌరస్తాలో బుధవారం వాహన తనిఖీలు చేపడుతుండగా ముధోల్ గ్రామానికి చెందిన ప్రేమ్ లక్ష్మణ్ వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తనిఖీలో ఎస్సై ఎండీ గౌసుద్దీన్ ఉన్నారు.

సమాజహితం.. కవిత్వం

నిర్మల్‌ఖిల్లా: కవికలానికి ఎల్లలు లేవు.. కథాంశానికి పరిధిలు లేవు.. భావవ్యక్తీకరణకు భాష అడ్డుకాదు.. కవికాలం కత్తికన్నా వాడియైనది. భూతమైనా, వర్తమానమైనా, భవిష్యత్ అయినా.. సున్నిత హాస్యం, వ్యంగ్యం, విమర్శ, ఎత్తిపొడుపు, నీతి, స్ఫూర్తి కీర్తి, మరేదైనా కవి కలంలో అక్షరాలుగా ఒదిగి పోవాల్సిందే.. కవిత్వం ఒక వాక్ కళ. వాక్కు పుట్టినప్పుడే కవిత్వమూ పుట్టి ఉంటుంది. కవిత్వం లేని భాష లేదు.. కవిత్వానికి అందని భావమూ లేదు. కవిత్వాన్ని సంక్షిప్తంగా చవిచూపడానికి ఒక్క పదునైన వాక్యమైనా సరిపోతుంది. మార్చి 21ని ప్రపంచ కవితా దినోత్సవంగా జరుపుకోవడం కవిత్వానికి గల విశ్వ ఆదరణకు నిదర్శనం. నేడు "ప్రపంచ కవితా దినోత్సవం" నేపథ్యంలో ప్రత్యేక కథనం..

కవుల జిల్లా...

నిర్మల్ జిల్లా అనగానే కవులు, కళాకారులు గుర్తొస్తారు. జిల్లా చరిత్రలో ఆది నుంచి సాహితీ సౌరభాలు విరబూస్తున్నాయి. జిల్లాలో తొలితరం కవుల నుంచి మొదలుకొని ప్రస్తుతం ఉన్న పద్యకవులు, వచన కవులు, కళాకారులు సాహితీవేత్తల వరకు కొదవలేదు. ఈ వారసత్వాన్ని ఉనికి పుచ్చుకొని వర్తమాన కవులు, కళాకారులు సైతం ఇదే మార్గంలో పయనిస్తున్నారు. కాలం ఏదైనా కవిత్వం యువతను ఆకర్షిస్తూనే ఉంది. కలం తన భావాలను వెదజల్లుతూనే ఉంది. దోపిడీపై ఎలుగెత్తిన విప్లవ కవిత్వం, అంటరానితనంపై మండిపడ్డ దళిత కవిత్వం, స్త్రీ సమానత్వాన్ని కాంక్షించే స్త్రీవాద కవిత్వం, జాతీయ భావాలను ప్రోదిచేసిన జాతీయోద్యమ కవిత్వం, నిరసన గళాన్ని వినిపించిన దిగంబర కవిత్వం ఇలా ఎన్నోరకాల కవిత్వాలు కాలం పొడవునా తన చేవ్రాలు చెక్కుతూనే ఉంటాయి.



నిర్మల్ జిల్లా కవులు

- అక్షర పరిమళం.. చైతన్య మార్గం
- సాహితీఖిల్లాగా.. నిర్మల్ జిల్లా
- సాహితీవేత్తలకు, కవులకు పుట్టినిల్లు
- కవితలు సమాజ చైతన్య గీతికలు
- విపణిలో పలు కవితాసంపుటిలు, గ్రంథాలు
- నేడు ప్రపంచ కవితా దినోత్సవం...

తొలితరం నుంచి నేటి వరకు సాహితీసృష్టలో..

జిల్లాలో ప్రాచీన కవులైన బోయ ధర్మయ్య, మామడ మునిపంతులు, పొన్నకంటి రాజయ్య, నేటి తరాన్ని ప్రభావితం చేసిన మడిపల్లి భద్రయ్య తదితరులున్నారు. ఆధునిక కవులలో ప్రస్తుతం బొందిడి పురుషోత్తం, నేరెళ్ల హన్మంతు, వెంకట్, చక్రధారి, దామెర రాములు, పత్తి శివప్రసాద్, కరిపె రాజ్‌కుమార్, పుండలీక్‌రావు, పోలీస్ భీమేష్, కృష్ణంరాజు, కామారపు జగదీశ్వర్, అబ్బడి రాజేశ్వర్‌రెడ్డి, తొడిశెట్టి పరమేశ్వర్ తదితర కవులు, రచయితలు తమ రచనలతో సామాజిక చైతన్య ప్రతీకలుగా కొనసాగుతున్నారు.



జిల్లాకవులు రచించిన పలు కవితా సంకలనాలు

సామాజిక దర్పణం.. కవిత్వం



సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో కవిత్వం ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. అక్షరాలను ఏరి, పదాలను కూర్చి, సమాజపు స్థితిగతులను వివరిస్తూ, పాలకవర్గాన్ని హెచ్చరిస్తుంది. కవిత్వమే పాటై ఉద్యమిస్తూ, అణగారిన బతుకులకు అండగా నిలుస్తుంది. సమాజ చైతన్యాన్ని ఆకాంక్షిస్తుంది కవిత్వం.

– పోలీస్ భీమేష్, యువకవి, కళాకారుడు, నిర్మల్

సామాజిక చైతన్యం కోసం..



రోజుకో కవితతో తొలి కోడికూతతో, తొలిపొద్దుతో శుభోదయంతో వాకిల్లు తెరుస్తూ చైతన్య కవిత్వాన్ని పంచుతున్నాను. సాహితీ విపణిలో ఇదోరకమైన సేవగా భావిస్తున్నాను. నిత్యం అక్షరయజ్ఞం చేస్తూ.. హృదయాంతరాళంలో భద్రంగా దాస్తున్నాను. కవులంటే దార్శనికులని, సమస్తాన్ని వీక్షించగల నేర్పరులని తెలియపరుస్తున్నాను.

– అంబటి నారాయణ, కవి, నిర్మల్

కవిత్వం నిత్యజీవన గమనం...



జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు, నిర్మల్ కవిత్వం ఒక కళ, అందుకే అరవై నాలుగు కళల్లో కవిత్వానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడింది. సామూహిక చైతన్యాన్ని కలిగించడంలో కవిత్వం పాత్ర అమోఘం. 'ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక' వాక్కులు అక్షర సత్యాలు. జీవితానికి జీవన అనుభవానికి ఆలంబన కవిత్వమే.

– కారం శంకర్, కవి, రచయిత, 'కవియాత్ర'

కవిత్వంలేని సమాజం ఊహాతీతం...



కవిత్వం లేని సమాజం ఊహించలేం.. సమాజాన్ని చైతన్యవంతం చేయడమే కవిత్వం పని. పల్లెపదాలతో అల్లుకున్న కవిత్వపు పాట ప్రజల నాలుకలపై సజీవంగా నడయాడుతుంది. శ్రమ జీవులు తమ కవనంలో మాటలతో, పాటలతో ఆడుతూ పాడుతూ జీవనం సాగిస్తారు. ఆహ్లాద జీవితానికి కవిత్వం దోహదపడుతుంది.

– నేరెళ్ల హన్మంతు, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు, నిర్మల్

కవిత్వం సౌందర్యాత్మక కళాఖండం



కవిత్వం మానవ అనుభూతుల కల్పనతో జనించే ఒక సౌందర్యాత్మక కళాఖండం.. నేను న్నానని నిండుగ పలికే స్వరమే కవిత్వం. కాలం కంట తడి పెట్టినప్పుడల్లా కన్నీరు కవి కలంలోకి పరకాయ ప్రవేశం చేసినప్పుడు వెలువడే వాక్యాలే కవిత్వం.. కవిత్వం సమాజపు ఆస్తి. అంధ విశ్వాసాల్ని నిర్మూలించడంలో తనవంతు పాత్ర పోషిస్తా.

– తొడిశెట్టి పరమేశ్వర్, కవి, రచయిత, నిర్మల్

సామాజిక స్పృహతోనే కవితాచైతన్యం..



జిల్లాలో తొలితరం నుంచి నేటి వరకు సామాజిక అభ్యుదయ భావాలను సంప్రదించే కవితలు సంకలనాలు వెలుబడుతూనే ఉన్నాయి. అక్షరాన్ని ఆయుధంగా మలుచుకొని పీడిత జనం కోసం పాలకులను ప్రశ్నించే గొంతుకలుగా చెప్పవచ్చు. ప్రజానీకంలో చైతన్యం తేవడానికి కవిత్వం కీలక పాత్ర పోషిస్తుంది.

– డా.అప్పాల చక్రధారి, ప్రముఖ కవి, పిల్లల వైద్య నిపుణులు, నిర్మల్

భూ సమస్యను పరిష్కరించండి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతంబాలు



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను తొలగించి భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతం బాలు అన్నారు. బుధవారం తహసీల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం, పేసా వంటి చట్టాలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతూ కొంతమంది ప్రభుత్వ భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లను తొలగించి ఆదివాసీ గిరిజనులకు భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సేడ్మాకీ రామారావు, మండల అధ్యక్షుడు పూసం ఈశ్రు, నాయకులు జైతు, సంతోష్, వీలాష్ తదితరులు ఉన్నారు.

యూఎస్‌ఎఫ్‌ఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా నగేశ్



ఆత్రం నగేశ్

ఎదులాపురం: భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా ఆత్రం నగేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆత్రం నగేశ్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తూ పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా సంవత్సరం ముగియక ముందే కాన్వాసింగ్‌లు నిర్వహించడం, ముందస్తు అడ్మిషన్‌లు జరుపుతున్నారని అన్నారు. ఈ విషయాల్లో విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు మెమోలు

- ఆలస్యంగా హాజరుకావడంపై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని సాయిలింగి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడాన్ని వివరిస్తూ బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రాజర్షి షా స్పందించారు. ఉదయం 8గంటలకు రావాల్సిన ఉపాధ్యాయులు ఆలస్యంగా రావడంపై సీరియస్ అయ్యారు. వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా డీఈవో ప్రణీతను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఈవో నారాయణ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశారు. వారిచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈవో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు.



ప్రజాపాలన సర్వర్ సమస్య...







రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6గ్యారంటీలో సంక్షేమ పథకానికి అర్హులందరూ దరఖాస్తులు చేసుకున్నారు. అయితే కొందరు దరఖాసుల్లో సాంకేతిక సమస్యలు రావడంతో మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం గడువు పెంచడంతో జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. బుధవారం సర్వర్ పనిచేయకపోవడంతో దరఖాస్తుదారులు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు అక్కడే క్యూలైన్‌లో వేచి ఉన్నారు. చేసేదేమీ లేక మధ్యాహ్నం వరకు ఉండి వెనుతిగారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అదనపు కట్నం కేసులో భర్తకు ఏడాది జైలు

ఖానాపూర్: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన పిట్ల రజితకు 2013లో జగిత్యాల జిల్లా మొగిలిపేట్‌కు చెందిన పిట్ల సాయిరాంతో వివాహమైంది. పెళ్లిలో రూ.లక్ష, తులం బంగారంతో పాటు సామగ్రి ఇచ్చారు. వీరి కాపురానికి గుర్తుగా 12ఏళ్ల కుమారుడు, పదేళ్ల కూతురు ఉన్నారు. కొంతకాలంగా రూ.2 లక్షల అదనపు కట్నం కావాలని అత్తింట్లో వేధింపులయ్యాయి. 2014లో భర్త ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లాడు. అప్పటి నుంచి బాధితురాలు తన పిల్లలతో ఖానాపూర్ మండలం తర్లపాడ్‌లోని తల్లి గారింట్లో ఉంటుంది. ఆ తర్వాత 2017లో భర్త స్వదేశానికి రావడంతో రజిత అత్తింటికి వెళ్లింది. భర్త రూ.2లక్షలు అదనపు కట్నం తేవాలని వేధించడం మొదలుపెట్టాడు. ఈ విషయమై పంచాయితీ నిర్వహించినప్పటికీ అతడిలో మార్పు రాలేదు. దీంతో 2017లో ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రజిత ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై చిన్నయ్య కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాడు. ఏపీపీవో రామకృష్ణ 9మంది సాక్షులతో నేరం రుజువు చేయడంతో ఖానాపూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జితిన్‌కుమార్ సాయిరాంకు పై విధంగా శిక్షను విధించినట్లు జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సక్రియానాయక్ తెలిపారు.

అవగాహన సదస్సులో ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు

భైంసా: హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన ట్రెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు పాల్గొన్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ మూడు రోజులుగా అధ్యాపకులు విద్యార్థులకు కౌన్సెలింగ్ చేయడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించారు. ఎమోషనల్ మేనేజ్‌మెంట్, మెంటల్ హెల్త్, ట్రెస్ మేనేజ్‌మెంట్‌లపై పలువురు వక్తలు అవగాహన కల్పించారు. చదువుకునే విద్యార్థులు మానసిక ఆందోళనలు ఎలా గుర్తించాలో అనే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రంజిత్‌కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు

పిడుగుపాటుతో ఏడు మేకలు మృతి..

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్‌లో బుధవారం పిడుగుపడి ఏడు మేకలు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పులిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన 4 మేకలు, తొట్ల సత్తయ్యకు చెందిన 3 మేకలు గ్రామం బయట మేతకు వెళ్లగా వర్షం కురిసే సమయంలో పిడుగుపాటుతో ఏడు మేకలు మృత్యువాత పడ్డాయి. దీంతో సుమారుగా రూ.80 వేల మేర నష్టం వాటిల్లిందని, పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.




మృతిచెందిన మేకల వద్ద బాధిత రైతులు

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్న ఖుర్షీద్‌నగర్‌కు చెందిన సాబీర్‌ఖాన్‌ను సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. మట్కా నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో బుధవారం దాడి చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రూ.5210 నగదుతో పాటు మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నారు. టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

లారీ బోల్తా



కుప్టి వద్ద బోల్తా పడిన లారీ

నేరడిగొండ: మండలంలోని జాతీయ రహదారిపై కుప్టి గ్రామ వంతెన సమీపంలో ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వస్తున్న లారీ బుధవారం రాత్రి బోల్తా పడిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం... ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వస్తున్న లారీ కుప్టి వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. కాగా వంతెన సమీపంలో రోడ్డుకు అడ్డంగా వాహనం బోల్తా పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలు ఇతర రహదారి నుంచి మళ్లించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని భగత్‌సింగ్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి ప్రయత్నించాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఏటీఎంలోకి ప్రవేశించిన దొంగ ఏటీఎం మిషన్ ముందు భాగాన్ని తొలగించాడు. నగదు ఉండే మిషన్ సైతం ధ్వంసం చేసి నగదు అపహరించుకెళ్లాలని విఫలయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం సైరన్ వినిపించడంతో దొంగ అక్కడి నుంచి పారిపోయాడు. అదే సమయంలో ఏటీఎం సెంటర్ల నిర్వహణను చూసే బ్యాంకు సిబ్బంది అప్రమత్తమై చోరీ యత్నం సమాచారాన్ని పోలీసులకు అందచేశారు. రెబ్బెన పెట్రోకార్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఏటీఎంను పరిశీలించారు. ఏటీఎం సెంటర్‌లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా దొంగ ఏటీఎం సెంటర్‌లోకి ప్రవేశించడంతో పాటు ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసే సంఘటనలు రికార్డయ్యాయి. ఖైరిగూడ ఓసీపీ ఓబీ పనుల కోసం కొన్ని రోజుల క్రితం మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వ్యక్తి ఈ చోరీకి యత్నించినట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయిన వీడియో ఆధారంగా పోలీసులు అనుమానిస్తున్నారు. అనుమానితుడి పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.



సీసీ ఫుటేజీలో రికార్డు అయిన చోరీ దృశ్యం

ఎస్పీఎం క్వార్టర్‌లో దొంగతనం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని న్యూకాలనీలో ఎస్పీఎం క్వార్టర్ నంబర్.సి 126లో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలతో పాటు బీరువా తాళాలు పగులగొట్టి అందులోని బంగారు ఆభరణాలతో పాటు రూ.10,500 నగదును దోచుకెళ్లారు. బుధవారం తెల్లవారు జామున ఇంటి యజమాని ఈర్ల సునీల్ కుమార్ వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలాన్ని డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జైపూర్: పెద్దపల్లి జిల్లా నుంచి సిరోంచకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జైపూర్ పోలీసులు మంగళవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నారు. రాత్రి పెట్రోలింగ్ తనిఖీల్లో భాగంగా ఇందారం క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించగా బొలెరో వాహనంలో 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రలోని సిరోంచకు తరలిస్తుండగా పట్టుకున్నట్లుగా ఎస్సై శ్రీధర్ తెలిపారు. పట్టుబడిన వాహనాన్ని, బియ్యాన్ని పోలీస్‌స్టేషన్ తరలించినట్లుగా ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై అబీబ్, కానిస్టేబుల్స్ సురేశ్, సుబ్బారావు ఉన్నారు.